శివారులో నవీన మున్సిపల్స్

- రంగారెడ్డి జిల్లాలో అదనంగా మరో మూడు మున్సిపాలిటీలు
- ప్రస్తుతం 13, మరో మూడింటితో 16 మున్సిపాలిటీలు
- త్వరలో మున్సిపాలిటీలుగా కందుకూరు, మహేశ్వరం, చేవెళ్లలు

రంగారెడ్డి, నవంబర్ 12(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగర శివారు (రంగారెడ్డి జిల్లా)లో కొత్తగా మరో మూడు మున్సిపాలిటీలు ఏర్పాటు కానున్నాయి. జిల్లా పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీలైన కందుకూరు, మహేశ్వరం, చేవెళ్లలను మున్సిపాలిటీలుగా మార్చాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులు ఆయా మేజర్ గ్రామ పంచాయతీల పూర్తి వివరాలను క్రోడీకరించి మున్సిపాలిటీలుగా మార్చటానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను చేసి ప్రభుత్వానికి నివేదికను పంపించారు. దీంతో ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో ఉన్న 13 మున్సిపాలిటీలకు తోడుగా మరో మూడు మున్సిపాలిటీలు రానుండటంతో జిల్లాలో మున్సిపాలిటీల సంఖ్య 16కు చేరనుంది. హైదరాబాద్ శివారులల్లోని రంగారెడ్డి జిల్లాలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కందుకూరు, మహేశ్వరం, చేవెళ్లలను కూడా మున్సిపాలిటీలుగా మార్చి తే ఈ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందే అవకాశాలున్నాయని ప్రభుత్వం భావించింది. అందులో భాగంగానే నగరానికి అత్యంత చేరువలో ఉన్న మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు, మ హేశ్వరంలు మున్సిపాలిటీలుగా రూపాంతరం చెందనున్నాయి. అలాగే, చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల హెడ్ క్వార్టర్స్ కూడా మున్సిపాలిటీలుగా మారనున్నాయి.

మహేశ్వరం మున్సిపాలిటీ..

మహేశ్వరం గ్రామ పంచాయతీ చుట్టు ప్రక్కల ఉన్న మహేశ్వరం, తుమ్మలూరు, సిగిరిపురం, గంగారం, ఉప్పు గడ్డ తండా, కేసీ తండా, మోహబత్ నగర్, ఎండి తండా, మన్సాన్‌పల్లి, గట్టుపల్లి, ఆకన్ పల్లి, రాంచంద్ర గూడ తదితర గ్రామాలను కలుపుతూ మహేశ్వరం మున్సిపాలిటీగా మార్చనున్నారు.

కందుకూరు మున్సిపాలిటీ..

కందుకూరు గ్రామ పంచాయతీ చుట్టు ప్రక్కల ఉన్న కందుకూరు, కొత్తగూడం, కొత్తూరు, గూడూరు, బైరాగిగూడ, నేదునూరు, దెబ్బడగూడ, ఆకుల మైలారం, మీర్‌ఖాన్‌పేట్, బేగరి కంచె, అన్నోజిగూడ, రాచులూరు, తిమ్మాపూర్, గుమ్మడవెల్లి, కటికపల్లి, జైత్వారం గ్రామాలను కలుపుతూ కందుకూరు మున్సిపాలిటీగా మార్చే ఏర్పాటు చేస్తున్నారు. అత్యధికంగా కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోకి 16 గ్రామ పంచాయతీలు రానున్నాయి. ప్రధానంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కందుకూరు మండలంలో ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్ సిటీని దృష్టిలో ఉంచుకుని మీర్‌ఖాన్‌పేట్, ఆకుల మైలారం, బేగరి కంచె గ్రామాలను కందుకూరు గ్రామ పంచాయతీలో కలుపుతూ మున్సిపాలిటీగా మార్చే యోచనలో ఉంది. ప్రధానంగా రంగారెడ్డి జిల్లాలోని నగర శివారు ప్రాంతాల్లో ఉన్న గ్రామాలను కలుపుతూ, మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేయటానికి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది.

16కు మున్సిపాలిటీలు..

ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో 13 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు న్నాయి. వీటికి తోడు కొత్తగా మరో మూడు మున్సిపాలిటీలు ఏర్పాటవుతుండటంతో జిల్లాలో మున్సిపాలిటీల సంఖ్య 16కు చేరనుంది.

ఉద్యోగాలు, పరిశోధనలకు విజ్ఞాన్ వర్సిటీ పెద్ద పీట

సిటీబ్యూరో, నవంబర్ 12(నమస్తే తెలంగాణ): యువతకు అత్యున్నత ఉద్యోగాలు కల్పించడం, వారిని గొప్ప పారిశ్రామికవేత్తలుగా చేయడంతో పాటు పరిశోధనలకు విజ్ఞాన్ యూనివర్సిటీ పెద్ద పీట వేస్తుందని వీసీ కల్నల్ ప్రొ. పి.నాగభూషణ్ అన్నారు. గుంటూరు, హైదరాబాద్ క్యాంపస్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేయగా, మార్చి 1 నుంచి ఏప్రి ల్ 15 వరకు ప్రవేశ పరీక్షలు ఉంటాయని తెలిపారు. వీ శాట్-2025 దరఖాస్తుకు ఫిబ్రవరి 25 వరకు అవకా శం కల్పించామని, దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లుగా తెలిపారు. పూర్తి వివరాలకు అన్ని విజ్ఞాన్ కార్యాలయాలు, యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

17, 18 తేదీలలో గ్రూప్-3 పరీక్షలు

సిటీబ్యూరో, నవంబర్ 12(నమస్తే తెలంగాణ): గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం ఆదేశించారు. జిల్లాలో 102 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. 45,918 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఈ నెల 17, 18న పరీక్షలు ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు నిర్ణీత సమయంలోపు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

నేటి నుంచి గేమింగ్ ఫెయిర్

సిటీబ్యూరో, నవంబర్ 12(నమస్తే తెలంగాణ): నగరంలో నేటి నుంచి ఈ నెల 15 వరకు గేమింగ్ ఫెయిర్ కొలువుదీరనుంది. అందులో భాగంగా ఇండియా గేమ్ డెవలపర్స్ కాన్ఫరెన్స్ బుధవారం హెచ్ఐసీసీలో జరగనుంది. గేమింగ్ ఫెయిర్‌కు సంబంధించిన వివరాలు నిర్వాహకులు వెల్లడించనున్నారు. కాగా, ఈ గేమింగ్ ఫెయిర్‌కు జాతీయ, అంతర్జాతీయ గేమింగ్ నిపుణులు హాజరవుతారు. గేమింగ్ కంపెనీ ఫౌండర్లు హాజరై, తమ సూచనలు ఇవ్వనున్నారు. 150 సెషన్స్ జరగనున్నాయి. కార్యక్రమంలో ఇన్వెస్టర్లు, గేమ్ డెవలపర్స్, పాలసీ మేకర్స్, గేమింగ్ ఔత్సాహికులు ఒకే వేదికపై తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు.

అంతర్జాతీయ ఈవెంట్ల వేదికగా ఎస్కీ

సిటీబ్యూరో, నవంబర్ 12(నమస్తే తెలంగాణ): 72 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న భారీ కన్వెన్షన్ సెంటర్ అందుబాటులోకి వచ్చింది. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఎస్కీ)లో నిర్మించిన ఈ భారీ కన్వెన్షన్ సెంటర్ నగరంలో జరిగే జాతీయ, అంతర్జాతీయ సమావేశాలకు వేదికగా మారనుందని డైరెక్టర్ రామేశ్వర్ రావు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 800 సీట్ల సామర్థ్యంతో నిర్మించిన ఈ కన్వెన్షన్ సెంటర్‌లో ఆడిటోరియం, విశాలమైన డైనింగ్ హాల్, లెక్చర్ హాల్స్, స్కై వ్యూ ఆడిటోరియం, ఓపెన్ రూఫ్ టాప్ కనోపి వంటి సదుపాయాలు ఉండగా, ఇప్పటికే అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్, 11వ జాతీయ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ వంటి సమావేశాలు జరిగినట్లుగా ఆయన పేర్కొన్నారు. కాలేజీ ప్రాంగణంలో, ఐటీ కారిడార్‌కు సమీపంలో ఉండే ఈ కన్వెన్షన్ సెంటర్ భవిష్యత్తులో అత్యంత రద్దీ అయిన ఈవెంట్ కేంద్రంగా మారనుందన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏ లోకి మార్చాలి

బీసీ డీసీ చైర్మన్ బి.వెంకటేశ్వర్లు

హిమాయత్‌నగర్, నవంబర్ 12: రాష్ట్రంలోని ముదిరాజ్‌లు అత్యంత పేదరికంలో మగ్గుతూ జీవనం సాగిస్తున్నారని వారి జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాల ని మాసబ్ ట్యాంక్‌లోని డీఎస్ఎస్ భవన్‌లో బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బి.వెంకటేశ్వర్లు, కార్యద ర్శి సైదులు, ఎంబీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అలోక్ కుమార్‌లను మంగళవారం తెలంగాణ మన ముదిరాజ్ మహా సభ ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో 54 శాతం బీసీలు ఉండగా, ఇందు లో 14.7 శాతం ముదిరాజులే ఉన్నారని జనా భానిష్పత్తి ప్రకారంగా, ముదిరాజులకు దక్కాల్సిన రాజకీయ రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. మహాసభ ప్రధాన కార్యదర్శులు శివయ్య ముదిరాజ్, సంతోష్, ఉపాధ్యక్షులు వెంకట్, భద్రయ్య, పి.సుధాకర్, జి.శ్రీనివాస్, వై.బలరాం, సిద్దేశ్వర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి

54వ రోజుకు చేరిన డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఉద్యోగుల ఆందోళన

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ప్రాంగణంలో ఆందోళనలో ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు

బంజారాహిల్స్,నవంబర్ 12: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని యూనివర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులు గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వర్సిటీ జేఏసీ సభ్యులు చేపట్టిన ఆందోళన మంగళవారం 54వ రోజుకు చేరుకుంది. ఆందోళనలో భాగంగా యూనివర్సిటీకి చెందిన అధ్యాపక, ఆధ్యాపకేతర, ఉద్యోగ సంఘాల నేతలతో పాటు పూర్వ విద్యార్థులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ పూర్వ విద్యార్థిని, గోల్డ్ మెడలిస్ట్ రుక్సాన మాట్లాడుతూ, ఉన్నత విద్యను పూర్తి చేయలేక ఇబ్బందులు పడిన గృహిణులు, మహిళలు, పేద విద్యార్థులు, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ వరంలాగా మారిందని, వేలాది మందికి ఉన్నత విద్యను ప్రసాదించిందన్నారు. ఇంతటి ఘనమైన చరిత్ర కలిగిన ఓపెన్ యూనివర్సిటీ మనుగడకు ప్రమాదం కలిగించేలా ప్రభుత్వం వ్యవహరించడం సరికాదన్నారు. స్థలాన్ని కేటాయించాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, డా. రవీంద్రనాథ్ సొలమన్, డా. పి.వేణుగోపాల్ రెడ్డి, ప్రొ. జి.పుష్పా చక్రపాణి, నేతలు డా. ప్రమీల కేతావత్, డా. బి.శ్రీనివాస్, రజినీకాంత్, రాములు, డా. రాఘవేందర్, డా. జి.అంబేద్కర్ పాల్గొన్నారు.

అగ్రికల్చర్ పీజీ ఎంట్రన్స్‌లో 3వ ర్యాంక్ సాధించిన భావనకు సన్మానం

రాయిపల్లిలో భావనను సన్మానిస్తున్న విద్యావంతులు

ఆత్మకూరు(ఎం), నవంబర్ 12 : మండలంలోని రాయిపల్లికి చెందిన భువనగిరి భావన కోయంబత్తూరులోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీజీ ఎంటమాలజీ విభాగం ప్రవేశ పరీక్షలో నాన్‌లోకల్ కోటాలో 3వ ర్యాంకు సాధించింది. భావన ఇటీవల మహారాష్ట్ర పరహబిలోని వసంతరావు నాయక్ కృషి విద్యాపీఠంలో అగ్రికల్చర్ బీఎస్సీలో గోల్డ్‌మెడల్ సాధించింది. డిగ్రీలో గోల్డ్‌మెడల్, పీజీ ఎంట్రన్స్‌లో 3వ ర్యాంకు సాధించిన భావనను విద్యావంతులు మంగళవారం సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగి కానుకుంట్ల స్వామి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నాయకుడు తౌర్ర ఉప్పలయ్య, తిమ్మాపురం మాజీ సర్పంచ్ నోముల నర్సిరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ వెలిమినేటి జహంగీర్ పాల్గొన్నారు.

వాగు ఆక్రమణదారులపై కేసు

యాదగిరిగుట్ట, నవంబర్ 12 : వాగును ఆక్రమించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రమేశ్ వెల్లడించారు. మండలంలోని మల్లాపురం గ్రామ సమీపంలో సైదాపురం గ్రామానికి చెందిన కనుకుల సిద్దారెడ్డి, మల్లాపురం గ్రామానికి చెందిన గౌడ సిద్ధులు వాగును ఆక్రమించారని ఇరిగేషన్ ఏఈఈ తురుణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పబ్లిక్ డ్యామేజ్ యాక్టు కింద వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాజకీయంగా అణగదొక్కే కుట్ర : సిద్ధారెడ్డి

స్థానిక సంస్థల్లో రాజకీయంగా అణగదొక్కేందుకు సైదాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తనపై తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కనుకుల సిద్ధారెడ్డి అన్నారు. తాను వాగును ఆక్రమించలేదని తెలిపారు. వాగులో కొంత మంది పనులు చేస్తుంటే వెళ్లి చూశానే తప్ప.. ఆక్రమానికి పాల్పడలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అసైన్డ్ భూములను ఆక్రమించి పట్టాలుగా మార్చి విక్రయించిన విషయాలను ఆధారాలతో బయటపెడుతానని తెలిపారు. తనపై మోపిన కేసుపై న్యాయ పోరాటం చేస్తానని చెప్పారు.

కొనసాగుతున్న జోనల్ స్థాయి క్రీడాపోటీలు

కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

రాజాపేట, నవంబర్ 12 : సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ ఆధ్వర్యంలో మండలంలో నిర్వహిస్తున్న జోనల్ స్థాయి క్రీడాపోటీలు మంగళవారం రసవత్తరంగా కొనసాగాయి. అండర్-14, అండర్-17 విభాగాల్లో 9 రకాల క్రీడలు నిర్వహించారు. కార్యక్రమంలో జోనల్ ఆఫీసర్ విద్యారాణి, డీసీఓ జగదీశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, క్రీడల సమన్వయకర్త జి.శ్రీనివాస్, పీడీ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్స్ రాజు శోభారాణి, పీటీ శృతి క్రీడలను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు

ఓంకారం, శివలింగం ఆకృతిలో వెలిగించిన దీపాలు

రామన్నపేట, నవంబర్ 12 : కార్తిక మాసం ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్రతాలు, నోములు ఆచరించి ఇండ్ల ముందు దీపాలు వెలిగించి పటాకులు కాల్చారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో శివాలయ అర్చకుడు పండిళ్ల విద్యాసాగర్‌శర్మ ఆధ్వర్యంలో పోచబోయిన జంగయ్య కుటుంబ సభ్యులు గోపూజ నిర్వహించారు.

తాటిచెట్లు నరికివేత

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 12 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో పిట్ట భాస్కర్‌రెడ్డి పొలంలో ఉన్న కల్లు గీసే తాటి చెట్లను మంగళవారం నరికివేశారు. ఈ విషయంపై గౌడ సంఘం సభ్యులు అడుగగా ఏం చేసుకుంటారో.. చేసుకోండి అంటూ అసభ్య పదజాలాలతో దూర్భాషలాడారని తెలిపారు. తాటి చెట్లు నరికి దుర్భాషలాడిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గీత కార్మికులు కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు పాలకుర్ల కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కొయ్యడ శ్రీనివాస్, నాయకులు నరసింహగౌడ్, కప్పల అంజయ్య, బైరు రాజయ్య, వెంకటేశం, బాలరాజు, శివకుమార్, నవీన్, భరత్, శివాజీ, సాగర్, శివగౌడ్ పాల్గొన్నారు.

దివీస్ పరిశ్రమకు కృతజ్ఞతలు

చౌటుప్పల్ రూరల్, నవంబర్ 12 : మండలంలోని జైకేసారం గ్రామంలో మంచినీటి శుద్ధి ప్లాంట్, భవన నిర్మాణానికి తోడ్పాటు అందిస్తున్న దివీస్ పరిశ్రమ యాజమాన్యానికి గ్రామ ప్రత్యేకాధికారి శ్రీధర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలకు శుద్ధమైన మంచినీటిని అందించడానికి రూ.11.75లక్షలతో ప్లాంట్ నిర్మాణం చేస్తున్న దివీస్ పరిశ్రమను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, పరిశ్రమ అధికారులు బి.గోపి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాలసదన్ ఉద్యోగుల తొలగింపు హర్షణీయం

భువనగిరి అర్బన్, నవంబర్ 12 : పట్టణంలోని బాలసదన్‌లో లైంగిక వేధింపుల సంఘటనపై ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులను విధుల నుంచి తొలగించడం హర్షణీయమని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకుడు కదారి వెంకటేశ్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇంతియాజ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో బాలసదన్, వసతిగృహాల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని తెలిపారు.

విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన

బొమ్మలరామారం, నవంబర్ 12 : మండలంలోని పెద్దపర్వతాపూర్‌లోని సాయిధామం ఆశ్రమంలో శ్రీసాయి విద్యాధామం ఉన్నత పాఠశాల విద్యార్థులకు గీతాంజలి ఇంజినీరింగ్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పండ్లు, మధ్యాహ్న భోజనం అందించారు. కార్యక్రమంలో సాయిధామం ఆశ్రమ పీఠాధిపతి రామానంద ప్రభుజీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధ్యాపకులు ఓడయ్య, ఆశ్రమం ఇన్‌చార్జి మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ చంద్రారెడ్డి, హెచ్ఎం జ్యోతి, ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా మధుకృష్ణ

మధుకృష్ణ

చౌటుప్పల్, నవంబర్ 12 : డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని జైకేసారం గ్రామానికి చెందిన పల్లె మధుకృష్ణ ఎన్నికయ్యారు. వలిగొండ మండల కేంద్రంలో 10, 11తేదీల్లో జరిగిన ఆ సంఘం జిల్లా ద్వితీయ మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు మధుకృష్ణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యువతకు ఉపాధి అవకాశాల కోసం నిరంతరం పోరాడుతానన్నారు. స్థానిక పరిశ్రమల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మందులు నిల్వ చేసిన వ్యక్తిపై కేసు నమోదు

దేశ్‌ముఖి గ్రామంలో మందులను సీజ్ చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విన్‌కుమార్

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 12 : మండలంలోని దేశ్‌ముఖి గ్రామంలో ఆకుల గోపీనాథ్ నిల్వ చేసిన రూ.40వేల విలువైన మందులను సీజ్ చేసినట్లు జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జె.అశ్విన్‌కుమార్ తెలిపారు. లైసెన్స్ లేని ప్రాంతంలో 31 రకాల మందులు నిల్వ చేసిన గోపీనాథ్‌పై కేసు నమోదు చేశామన్నారు. సీజ్ చేసిన మందులను చౌటుప్పల్ కోర్టుకు అప్పగించామని చెప్పారు.

జిల్లా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్

చంద్రశేఖర్

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 12 : జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భూదాన్ పోచంపల్లికి చెందిన భోగ చంద్రశేఖర్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటో, వీడియోగ్రాఫర్ల సమస్యల పరిష్కారం కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

టీయూఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా శేఖర్

శేఖర్ ముదిరాజ్

చౌటుప్పల్, నవంబర్ 12 : మండల కేంద్రానికి చెందిన కానుగు శేఖర్ ముదిరాజ్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన శ్రీనివాస్‌తో పాటు జిల్లా అధ్యక్షుడు బాలయ్యకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 12 : మండలంలోని వీరవెల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామానికి చెందిన సిరికొండ ఐలయ్య (35) వారం రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

21 నుంచి ఇండియన్ ప్లంబింగ్ కాన్ఫరెన్స్

అమీర్‌పేట్, నవంబర్ 12: నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు దేశంలో అతి పెద్ద ప్లంబింగ్ కాన్ఫరెన్స్ జరుగనున్నది. 'వాటర్-ది న్యూ కరెన్సీ' అనే థీమ్‌తో జరుగనున్న 30 వ ఇండియన్ ప్లంబింగ్ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన విశేషాలను మంగళవారం బేగంపేట్‌లోని హోటల్ ప్లాజాలో జరిగిన సమావేశంలో ఇండియన్ ప్లంబింగ్ అసోసియేషన్ సభ్యులు సంజయ్ భిలారే, మనోజ్ మాథూర్, భాస్కర్, తనుకుమార్, శ్రవణ్ కుమార్ వెల్లడించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఐటీ, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, ప్రధాన వక్తగా భారత్‌లోని డెన్మార్క్ ఎంబసీ ప్రతినిధి, ట్రేడ్ కౌన్సిల్ దక్షిణాసియా ప్రాంతీయ సమన్వయకర్త సెరెన్ నెర్రీలండ్ కన్నిక్ మార్క్వడ్‌సెన్, గౌరవ అతిథిగా తెలంగాణ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ హాజరవుతారని తెలిపారు. దేశ, విదేశాల నుంచి 1500 మంది ప్లంబింగ్ శిరాగ్ర నిపుణులు హాజరుకానున్నారని, 80 మంది ఎగ్జిబిటర్లు తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శిస్తారని, 5వేల మంది సందర్శకులు ఈ సదస్సుకు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. సదస్సులో 'వాటర్-ది న్యూ కరెన్సీ'తో సహా పలు ఆసక్తికరమైన సాంకేతిక సెషన్స్, ప్యానెల్ డిస్కషన్స్‌తోపాటు బిల్డ్ ఎన్విరాన్మెంట్ నెట్ జీరో, జలం-వారసత్వాన్ని పునరుజ్జీవింపజేయడం, ఎత్తైన భవనాలను అధిక సవాళ్లు, హాస్పిటాలిటీ సెక్టార్‌లో నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత, నీటి దృశ్యం వంటి విషయాలపై జాతీయ, అంతర్జాతీయ స్థాయి నిపుణులచే చర్చలు, ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. ఇటీవల బెంగళూరు, చెన్నై నగరాలలో నీటి కొరత కారణంగా ఏర్పడిన 'డే జీరో' తరహా పరిస్థితులు హైదరాబాద్‌లో ఉండే అవకాశం లేదన్నారు.

దేశంలో డయాబెటిస్ పది కోట్లు

- మహమ్మారిని గుర్తించడమే వ్యాధి నియంత్రణలో కీలకం
- మానవాళికి సవాలుగా మారిన ప్రాణాంతకమైన వ్యాధి
- స్పష్టం చేసిన కేర్ హాస్పిటల్ ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, సీనియర్ వైద్యులు డా. బిపిన్ కుమార్ సేథి

సిటీబ్యూరో, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): మానవాళి జీవన ప్రమాణాలను నిర్వీర్యం చేసే ప్రాణాంతకమైన వ్యాధులలో డయాబెటిస్ ఒకటని, దేశంలో 10 కోట్ల మందికి పైగా ఈ మహమ్మారి బారిన పడ్డారని కేర్ హాస్పిటల్ ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, సీనియర్ వైద్యులు డా. బిపిన్ కుమార్ సేథి స్పష్టం చేశారు. వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా చక్కెర వ్యాధి ప్రభావం, ఆరోగ్యకరమైన జీవనం, నివారణ విధానాలపై అవగాహన కల్పించారు. డయాబెటిస్ వ్యాధి మూలాన భారత్‌పై తీవ్ర భారం పడుతుందని, దేశంలో ఎక్కువ మంది ప్రీ డయాబెటిస్‌తో బాధపడుతున్నవారే ఉన్నారని తెలిపారు. ఇందులో చాలా మందికి నిర్ధారణ కాలేదన్నారు. సైలెంట్ కిల్లర్‌గా ఆరోగ్యాన్ని కబళించే వ్యాధి నియంత్రణలో ఎన్నో సవాళ్లను అధిగమించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రధానంగా డయాబెటిస్ రోగుల జీవన శైలి, దృఢమైన మనోబలం, జీవన ప్రమాణాలను కూడా దెబ్బ తీస్తోందన్నారు. రక్తంలో చక్కెర స్థాయి నిర్వహణ, జీవనశైలి అనుకూలతలు, మానసిక, సామాజిక ప్రోత్సాహంతో మధుమేహాన్ని జయించవచ్చన్నారు. ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి రుగ్మతలు కూడా రోగితో కలిసి జీవిస్తాయన్నారు. దీంతోనే మధుమేహ వ్యాధి నియంత్రణలో సమర్థవంతమైన విధి విధానాలతోనే సాధ్యం అవుతుందన్నారు. జీవన శైలి మార్పులతో డయాబెటిస్ నియంత్రించవచ్చన్నారు. అయితే, కలగానే మిగిలిపోతుందనీ, ఈ విషయంలో రోగికి కుటుంబ సహకారం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. వ్యాధి నివారణ, నియంత్రించకపోతే గుండె, కళ్లు, మూత్ర పిండాలు, నరాల ఆరోగ్యం దెబ్బ తింటుందన్నారు. ప్రాసెస్డ్ షుగర్, సమతుల ఆహారం, సాధారణ శారీరక శ్రమతో వ్యాధి నియంత్రణలో సాయపడుతుందన్నారు. బరువు నియంత్రించగలిగే మందులను ఎంచుకోవాలన్నారు. బ్లడ్ షుగర్, బ్లడ్ ప్రెజర్, కొలెస్ట్రాల్ నియంత్రణతో పాటు, రెగ్యులర్ హెల్త్ చెకప్‌లూ, ఎస్‌జీఎల్‌టీ-2 ఇన్‌హిబిటర్స్, జీఎల్‌పీ-1ఏ వంటి ఔషధాలను వాడాలన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తపై అవగాహన కల్పించాలన్నారు. డయాబెటిస్ ఫ్రీ భారత్ కోసం క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలు, మెరుగైన జీవనశైలి, సమతుల ఆహారం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని డాక్టర్ బిపిన్ సేథ్ పేర్కొన్నారు.

కళా రంగాల్లో నిపుణులకు పురస్కారాలు.. ముదావహం

విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి

తెలుగు వర్సిటీ అభివృద్ధికి నూతన వీసీ నిత్యానందరావు రూ.50 వేల విరాళం

సాహితీ పురస్కారాలను రచయితలకు ప్రదానం చేసిన వక్తలు

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 12: తెలుగు భాషా సాహిత్యం లలిత కళల్లో విశేష కృషి చేసిన ప్రముఖులకు పురస్కారాల ప్రదానం ముదావహమని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2022వ సంవత్సరానికి గాను తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలలో ఉత్తమ గ్రంథాలను అందించిన పది మంది తెలుగు రచయితలకు సాహితీ పురస్కారాలను నాంపల్లిలోని యూనివర్సిటీ ఆడిటోరియంలో మంగళవారం ప్రదానం చేశారు. తెలుగు యూనివర్సిటీ వీసీ ఆచార్య నిత్యానందరావు అధ్యక్షోపన్యాసం చేస్తూ, తెలుగు వర్సిటీ అభివృద్ధికి మూలధనం ఏర్పాటు చేయాలనే సంకల్పాన్ని ప్రకటించిన ఆయన, తన వంతుగా రూ. 50 వేల చెక్కును ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య వై.రెడ్డి శ్యామలకు అందజేసి దాతలకు మార్గదర్శకంగా నిలిచారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ, లలిత కళలల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న నిష్ణాతులను జాతికి అందిస్తున్న తెలుగువర్సిటీ దేశ విదేశాలలో అంతర్జాతీయ తెలుగు కేంద్రం ద్వారా తెలుగు భాష సంస్కృతిని మరింతగా ప్రచారం చేయడానికి కృషి చేయాలని సూచించారు. పూర్వ వీసీ ఆచార్య టి.కిషన్ రావు పాల్గొని రచయితల కృషిని ప్రశంసించారు. పెండ్యాల కిషన్ శర్మ, మెర్సీ మార్గరేట్, ఎన్నవెల్లి రాజమౌళి, కొట్టం రామకృష్ణారెడ్డి, తాళ్ళపల్లి యాకమ్మ, ఆచార్య వెల్దండ నిత్యానందరావు, పీప దేవి, గురుమూర్తి, సయ్యద్ నజీర్, చాగంటి తులసిలు పురస్కారాలు అందుకున్నారు. ఒక్కొక్కరికి రూ.20,116ల నగదుతో పాటు పురస్కార పత్రంతో సత్కరించారు.